క్లుప్తంగా

సాయిబాబా సేవలో అద్వైతానందగిరి స్వామీజీ



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి శ్రీ సత్య షిర్డి సాయిబాబాని అద్వైతానందగిరి స్వామీజీ ఆదివారం దర్శించుకున్నారు. స్వామీజీకి సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న గోశాలను దర్శించి, గోవులకు దాణా పెట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రాతూరి శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మంగళగిరి టౌన్ : వేసవి నేపథ్యంలో మంగళగిరి నగర పరిధిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్ వద్ద ఆదివారం గౌరీశంకర్ జిరాక్స్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఉడతా శ్రీను మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రామనాథం సుబ్రహ్మణ్యం, నల్లమోలు కాంతారావు, అక్కల తులసి నవీన్ పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వస్తువులు బహూకరణ



తాడేపల్లి రూరల్ : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో వేంచేసిన కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవాలయంలోని అమ్మవారికి అదే గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకులు వెండి వస్తువులను ఆదివారం బహూకరించారు. దాత కాజా వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులు మాట్లాడుతూ సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన గంగా కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవాలయానికి ఉగాది పండుగను పురస్కరించుకుని నాగపడిగ, కిరీటం అందజేశామని తెలిపారు. గతంలో వెండి కిరీటం, చటారి, వెండి పళ్లెం సమర్పించామని తెలిపారు.కాజా కాశీ రాంబాబు, కాట్రగడ్డ ఆంజనేయులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

అలరించిన ‘ఆనంద లహరి’



తెనాలి: స్వచ్ఛంద సేవాసంస్థ మానవత ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన వినూత్నంగా ‘ఆనంద లహరి’ని నిర్వహించారు. ఏఎస్ఎన్ కాలేజీ ఆవరణలోని కళావేదికపై కళా, సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు. సభ్యులు కుటుంబాలతో హాజరయ్యారు. మృదంగ విద్వాంసుడు, కంచి కామకోటి ఆస్థాన విద్వాంసుడు కానూరి వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో తొలుత శాస్త్రీయ సంగీత విభావరితో ఆరంభించారు. గాయనీమణి టి.శ్రీకాంతి గాత్రకచేరీ రంజింపజేసింది. ఆర్.వెంకటప్పయ్య వయొలిన్‌పై, కేవీ రామకృష్ణ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. ‘గాన కళారత్న’ వెంపటి సత్యనారాయణ సినీసంగీత విభావరి ప్రేక్షకుల కరతాళధ్వనులను అందుకుంది. వీటితోపాటు శ్రీలక్ష్మీ కూచిపూడి నృత్యకళాకేంద్రం గురువు ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం ప్రదర్శించిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థుల దాండియా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మానవత రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, చైర్మన్ డాక్టర్ కె.రామ్‌చంద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, మల్లికార్జునరావు తదితరులు పర్యవేక్షించారు.

హనుమాన్ చాలీసా పారాయణ



తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం సత్రం కమిటీ చైర్మన్ నూకల వెంకట వేణుగోపాలరావు పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ములుకుట్ల విశ్వనాథశర్మ పంచాంగ శ్రవణం చేశారు. సత్రం కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు, కమిటీ కార్యవర్గ సభ్యులు వుప్పల వరదరాజులు, గొడవర్తి సాయిహరే రామ్, నూకల భాస్కర్, గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

కళ తప్పిన క్రీడా ప్రాంగణం

- వైఎస్సార్ క్రీడా ప్రాంగణంపై నిర్లక్ష్యం
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- సభ్యులుగా చేరేందుకు భారీగా ఫీజులు
- వసతుల కల్పనను పట్టించుకోని వైనం



డాక్టర్ వైఎస్సార్ క్రీడా ప్రాంగణం

మంగళగిరి: మంగళగిరి, తాడేపల్లి పట్టణాలతో పాటు 23 గ్రామాల విలీనంతో ఏర్పడిన మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ)లో ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యాన్ని అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ క్రీడా ప్రాంగణం నిర్మించారు. రూ.4.55 కోట్లతో ఆత్మకూరు గుంటూరు కాలువ పక్కన తాగునీటి పథకం వద్ద ఖాళీ స్థలంలో నిర్మించిన ఈ క్రీడా ప్రాంగణంలో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, పవర్ లిఫ్టింగ్ క్రీడలతో పాటు చిన్న పిల్లలు ఆడుకునేందుకు జారుడు బల్ల, ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. అన్ని క్రీడలకు వసతులు ఒకే చోట కల్పించి, నగర ప్రజలకు క్రీడలపై ఆసక్తి కలిగేలా నిర్మించారు. ఆయా క్రీడల్లో ప్రావీణ్యం సాధించేందుకు ఆసక్తి కలిగిన వారికి కోచ్‌ను ఏర్పాటు చేశారు. తొలి రోజుల్లో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల కృషితో భారీగా క్రీడా ప్రాంగణానికి విద్యార్థులు, క్రీడాకారులు వచ్చారు. తొలి సంవత్సరం క్రీడాకారులతో కళకళలాడిన ప్రాంగణం నేడు వెలవెలబోతోంది. క్రీడా ప్రాంగణాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో క్రీడాకారులు, సందర్శకుల తాకిడి రోజు రోజుకి తగ్గిపోయింది. తొలి రోజులలో స్విమ్మింగ్ కోసం రోజుకు 50 మంది.. శని, ఆదివారాల్లో 100 మందికి పైగా క్రీడా ప్రాంగణాన్ని సందర్శించేవారు. స్విమ్మింగ్ చేసుకునేందుకు యువతీ యువకులకు ప్రత్యేకంగా వసతులు ఏర్పాటు చేశారు. నేడు శని, ఆదివారాల్లోనే 10 నుంచి 20 మంది రాకపోవడం విశేషం. స్విమ్మింగ్ పూల్‌లో రోజూ నీరు మార్చకపోవడం, క్రీడా ప్రాంగణం పరిశుభ్రంగా లేకపోవడంతో పాటు ప్రచారం కొరవడడంతో క్రీడాకారులు రావడం లేదు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం కళావిహీనంగా మారుతోంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు వైఎస్సార్ క్రీడా ప్రాంగణంపై దృష్టి సారించి, పూర్వవైభవం తీసుకురావాలని క్రీడాభిమానులు, స్థానికులు అధికారులను కోరుతున్నారు.



స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్ చేస్తున్న చిన్నారులు



స్కేటింగ్ ట్రాక్



వృథా చేస్తారు.. దాహార్తి అంటారు

తాడేపల్లి పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లోని పబ్లిక్ కొళాయిలకు పైపులైన్లు అమర్చి నివాసాలకు నీరు మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో కొళాయిలకు ట్యాప్‌లు తొలగించడంతో తాగు నీరు వృథాగా పోతోంది. ఆదివారం ఉదయం పట్టణ పరిధిలోని పాత జాతీయ రహదారి పక్కన పబ్లిక్ కొళాయికి ట్యాప్ లేకపోడంతో తాగునీరు వృథాగా పోయింది. రోడ్డు మొత్తం నీరు పారడంతో బురదమయం అయ్యింది. అధికారులు వేసవిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – తాడేపల్లి రూరల్

తెలుగు భాషపై చిన్నారులకు పరీక్ష



తెనాలి: ఉగాది పర్వదినం సందర్భంగా మడుపల్లి వెంకటేశ్వర్లు–రంగనాయకమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం తెలుగు భాషపై పరీక్ష నిర్వహించారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 5, 6 తరగతులకు చెందిన 50 మంది బాలబాలికలు హాజరయ్యారు. అనంతరం తొలి ముగ్గురు విజేతలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి బహూకరించారు. మరో పదిమందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మడుపల్లి శ్రీనివాస్–పద్మజలు బహుమతులను అందజేయగా, అతిథులుగా కూరపాటి రవీంద్ర, కళ్యాణి దంపతులు, ఆర్ఎస్ఎస్ లక్ష్మీనారాయణ, లలితా గ్రూప్ సభ్యులు హాజరయ్యారు.

వైభవంగా ఉగాది వేడుకలు

దుగ్గిరాల: విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. దుగ్గిరాలలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామిని పూలతో అలంకరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ఉగాది పచ్చడి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పంచాంగ శ్రవణ కార్యక్రమం భాష్యం నృసింహ సాకేత్ నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది. కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఉగాది సందర్భంగా అమ్మ వారిని దర్శించుకుని పూజలు జరిపించారు. అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ పంచాంగ శ్రవణం చేశారు. చిలకలూరిపేటకు చెందిన తోట మునిలి నాయుడు, ధనలక్ష్మి దంపతులు అమ్మవారికి రూ.1,01,116 విరాళం అందజేశారు. ధర్మకర్త డి.రంగప్రసాద్, ఈఓ కె.సునీల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి



దేవస్థానానికి విరాళం అందజేస్తున్న దాతలు

ఆలయాల్లో ఉగాది పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు. అర్చకులు వారికి ఉగాది పచ్చడి అందజేశారు. మండల కేంద్రంలోని వేణుగోపాల ఆలయంలో వెంకటేశ్వర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు రేపూడి నాగరమణారావు, ఆర్.సుబ్రహ్మణ్యశర్మ, ఈవో జె. శ్రీనివాసరావు, అర్చకులు నారాయణం, వంశీకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఈద్ – ఉల్ – ఫితర్




పాత బస్టాండ్ వద్ద విద్యుద్దీపాలంకరణలో మసీదు

- ఉపవాస దీక్షలు విరమించిన ముస్లింలు
- ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలు సిద్ధం

మంగళగిరి టౌన్ / తాడేపల్లి రూరల్ : నెలవంక దర్శనంతో నెల రోజుల కఠోర ఉపవాస దీక్షలను ముస్లింలు ఆదివారం ఇఫ్తార్‌తో ముగించారు. సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం సాయంత్రమే పండుగ సామగ్రి కొనుగోళ్లతో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లోని దుకాణాలు కిటకిటలాడాయి. మానవాళి సంక్షేమం కోసం మహమ్మద్ ప్రవక్త ద్వారా పవిత్ర ఖురాన్ ఆవిష్కారమైన రంజాన్ మాసం ఈద్ – ఉల్ – ఫితర్ రాకతో ఘనంగా ముగిసింది. భగవంతుని దృష్టిలో పేద, ధనిక వ్యత్యాసం లేదని, అందరూ సమానమేనని నిరూపించిన ఉపవాస దీక్షలను ఇఫ్తార్‌తో ముస్లింలు ముగించారు. 30 రోజులుగా స్నేహానికి, ఆప్యాయతలకు ప్రాధ్యామిస్తూ కులమతాలకు అతీతంగా సర్వమత సహనంతో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. నెలవంక కనిపించడంతో మసీదు పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. నెలవంకను చూసిన అనంతరం ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు చేసి దువా పఠించారు. మంగళగిరి నగర పరిధిలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న మసీదు, పాత మంగళగిరి కల్యాణ మండపం వద ఉన్న మక్కా మసీదు, తాడేపల్లిలోని జామియా మసీద్, ముగ్గు రోడ్డులోని నూరాని మసీదు, పోలకంపాడులోని మసీదు ప్రార్థనల కోసం సిద్ధం చేశారు. మసీదులు విద్యుద్దీపాలంకరనలో కాంతులీనాయి.



పాత మంగళగిరిలోని మక్కా మసీదు



ముగ్గురోడ్డులోని నూరాని మసీదు

వడ్డీ రాయితీకి నేడు తుది గడువు



తెనాలి అర్బన్: పట్టణంలోని ఇంటి, నీటి, ఖాళీ స్థల పన్నుల చెల్లింపులపై వడ్డీ రాయితీ సోమవారంతో ముగియనున్నట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆది, సోమవారాల్లో పండుగలు వచ్చినప్పటికీ పన్నుల చెల్లింపు కేంద్రాలు తెరిచి ఉంచామన్నారు. మున్సిపల్ కార్యాలయం, పట్టణంలోని ఐదు తాత్కాలిక కేంద్రాలు కూడా పని చేస్తున్నాయని చెప్పారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో టీడీపీకి భంగపాటు

మంగళగిరి: మంగళగిరి బార్ అసోషియేషన్‌కు జరిగిన ఎన్నికలలో టీడీపీ లీగల్ సెల్ నుంచి పోటీచేసిన అభ్యర్థులు ఓటమి చెందారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఖంగుతిన్నారు. శనివారం అసోషియేషన్ ఎన్నికలు నిర్వహించగా టీడీపీ లీగల్ సెల్ నుంచి అధ్యక్షుడిగా పోటీ చేసిన బ్రహ్మానందరావుతో పాటు పలువురు ఓటమి పాలయ్యారు. బ్రహ్మానందంపై లంకా శివరామ్‌ప్రసాద్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా లీగల్ సెల్ నుంచి పోటీ చేసిన బేతపూడి నాయుడమ్మ ఓటమి పాలవగా అతనిపై పోటీ చేసిన ప్రత్తిపాటి నవజీవన్ విజయం సాధించారు. టీడీపీ లీగల్ సెల్ నుంచి అధికారికంగా పోటీచేసిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇద్దరూ ఓటమి పాలవడంతో ఆ పార్టీ సీనియర్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందే భారీగా ప్రచారం నిర్వహించి, మద్దత్తు పలికినా ఎందుకు ఓటమిపాలయ్యారని పార్టీ కార్యాలయం నాయకులు లీగల్ సెల్ నాయకులను నిలదీయడంతో ఏమి సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్లు తెలిసింది. విజయం సాధించిన వారిలో అత్యధికంగా వైఎస్సార్ సీపీపై అభిమానం ఉన్న వారు కావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది.

నూతన ఉత్తేజంతో పనిచేద్దాం

- మంగళగిరిలో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకొద్దాం
- ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది
- మంగళగిరి పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నూతన ఉత్తేజంతో చేయాలని ఆ పార్టీ మంగళగిరి సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉండవల్లిలోని పార్టీ మండల అధ్యక్షుడు అమరా నాగయ్య అధ్యక్షతన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వేమారెడ్డి ముందుగా నియోజకవర్గ ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కొత్త సంవత్సరం నుంచి నూతన ఉత్సాహంతో పనిచేసి, మరోసారి పార్టీ జెండాను ఎగురవేద్దామని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కొంతమంది నాయకులు, కార్యకర్తలతో పనిలేకుండా వలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి అన్ని పనులు చేశారని, దాంతో కొంతమందిలో అసంతృప్తి ఏర్పడిందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఉద్దేశంతో ఆ పని చేశారని పేర్కొన్నారు. దానిని ఎవరూ తప్పు పట్టాల్సిన అవసరం లేదన్నారు. ఇక నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ, పనులు చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ తాడేపల్లి రూరల్ గౌరవ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, ప్రముఖ న్యాయవాది కాశినీడు బాజీ గంగాధర్, నాయకులు దంటు గోవర్ధన్ రెడ్డి, మున్నంగి శ్రీధర్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, నక్కా ఆనంద్‌బాబు, బండారుపల్లి అనిల్, శ్రావణ్, సంకురు వేణు, మన్నెం సుబ్బారావు, కళ్ళం పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

కమిటీలను ఏర్పాటు చేశాం

మంగళగిరి: రాష్ట్రంలోనే వైఎస్సార్ సీపీ గ్రామ, వార్డు కమిటీలను నియమించిన నియోజకవర్గం మంగళగిరి అని ఆ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళగిరి పట్టణ, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలోనే చేసిన రూ.లక్ష కోట్లు అప్పులు ఏమయ్యాయో తెలియదన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేని సీఎం చంద్రబాబు నాయుడు సాకుగా.. రాష్ట్ర ఆర్థికపరిస్థితి బాగోలేదని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మల్లవరపు సుధారాణి, బీసీ, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌లు తాడిబోయిన సుబ్బారావు, కట్టిపోగు భూషణం, పట్టణ, మండల కన్వీనర్లు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత, రాజ్యలక్ష్మి, జిల్లా కార్యదర్శులు ఈపూరి ఆదామ్, పచ్చల శ్యాంబాబు, మాబు పాల్గొన్నారు.

మహాప్రస్థానం వాహన సేవలు పునరుద్ధరణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ అండ్ కేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మహాప్రస్థానం వాహన సేవలను పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ట్రస్ట్ నిర్వాహకులు, గుంటూరు టెలికాం మెంబర్ కళ్లం రాజశేఖరరెడ్డితో కలసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాప్రస్థాన సేవలు కొన్ని కారణాల వల్ల అందించలేకపోయారని తెలిపారు. సేవల పునః ప్రారంభానికి కళ్లం రాజశేఖరరెడ్డి రూ.5లక్షలు వెచ్చించారని తెలిపారు. ఎవరికైనా ఉచితంగా మహాప్రస్థాన వాహనం కావాలంటే 98486 20160, 93915 45439 నంబర్లకు సంప్రదించాలన్నారు. సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి మేకా వెంకట రామిరెడ్డి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, దొంతిరెడ్డి శ్రీరామ్ రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు బందాపు రుక్మాంగరెడ్డి, బీసీ నాయకులు బత్తుల దాసు, బందాపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మహాప్రస్థానం వాహనాన్ని ప్రారంభిస్తున్న వేణుగోపాల సోమిరెడ్డి తదితరులు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

తాడేపల్లి రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఉండవల్లి అంబేడ్కర్ నగర్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం క్రైస్తవ సంఘాలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించాయి. అంబేద్కర్ నగర్ నుంచి ఉండవల్లి కూడలి వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతితో క్రైస్తవులు ఆందోళన చెందుతున్నారని, మత సామరస్యం కోసం అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి లూథరన్ చర్చి పాస్టర్ రెవ.విజయరావు, పాస్టర్ క్రాంతి కుమార్, రాయపూడి కిరణ్, జ్యోతిబసు, వాసుపల్లి లాజర్, బండి జగన్‌మోహన్‌రావు, కంచర్ల శేషయ్య, పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో పారదర్శకంగా విచారణ జరపాలని పాస్టర్ డానియేల్ రాజ్ డిమాండ్ చేశారు.



క్రిస్టియన్‌పేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

తాడేపల్లి క్రిస్టియన్‌పేటలో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ప్రవీణ్ మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ్ మృతికి కారణాలను ప్రభుత్వం గుర్తించాలని,మృతికి గల కారకులకు కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జార్జి, మోషే, పాల్,స్త్రీల సమాజం యూత్, సంఘ పెద్దలు శానం ప్రభాకరరావు, వనమా మోషే, అన్నూరి వివేక్, మేడికొండ ఏసోబు, మదిర ఏసుబాబు, మన్నం బాబు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీలను తగ్గించాలి

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఉండవల్లి పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో రెండుసార్లుగా రూ.15,485 కోట్ల విద్యుత్ భారం వినియోగదారులపై భారం మోపిందని విమర్శించారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన విద్యుత్ నియంత్రణ మండలిని పాలకులు డమ్మీగా మార్చారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో వినియోగదారులపై కొత్త భారాన్ని మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. మోసపూరిత కండిషన్లు పెట్టి, విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను అంటగట్టే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఈమని రామారావు, రాజధాని డివిజన్ నాయకులు బక్కిరెడ్డి, ఆర్‌వీ రాఘవయ్య, కె.రామకృష్ణ, పి.గాంధీ, సైకం వెంకటనారాయణ పాల్గొన్నారు.